నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 23 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

## పత్తి పంట పరిశీలన

పత్తి పంటను పరిశీలిస్తున్న స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు ఇవాన్స్, మదీనలు

జైనథ్, ఆగస్టు 22 : అడ కంటం గ్రామాల్లో స్విట్జర్ ల్యాండ్ దేశానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇవాన్స్, మదీనాలు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా భుశెట్టి నారాయణ పొలంలోని రైతులతో కలిసి పత్తి పంటపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ కంటం మాజీ సర్పంచ్ వైద్య బాలాజీ, ఆదర్శ రైతులు కె.రాంరెడ్డి, రషీద్, దినేశ్, విశ్వాస్, సంతోష్, బాదం శ్రీనివాస్ రెడ్డి, ఉగ్గె గజానంద్, అల్లూరి రాంరెడ్డి, పాయల్ సంతోష్ పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### ఎస్పీ జానకి షర్మిల

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, ఆగస్టు 22 : రానున్న గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తూ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉన్నతాధికారులు, పోలీసులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్సవాల భద్రత ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఉత్సవాల ఏర్పాట్లకు సంబందించి మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్, రవాణ శాఖ, మండప నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. గణేశ్ శోభాయాత్రలో ఆటంకాలు జరగకుండా ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఉత్సవాలపై సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వదంతులను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవినాశ్(ఐపీఎస్), డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడలో రైతుల భారీ ర్యాలీ

# బీఆర్ఎస్ భగ్గు

- రుణమాఫీ చేయాలని రాస్తారోకోలు, ధర్నాలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన గులాబీ శ్రేణులు
- స్వచ్ఛందంగా ఆందోళనల్లో పాల్గొన్న రైతులు

ఆదిలాబాద్/నిర్మల్, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలంటూ గురువారం ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా రైతుల ఆగ్రహావేశాలతో దద్దరిల్లాయి. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలతోపాటు మండలం కేంద్రాల్లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాలకు భారీ సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఆదిలాబాద్ విశ్రాంతి భవనం ఎదుట మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులతోపాటు వివిధ గ్రామాల నుంచి రైతులు వచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం అనంతరం, ధర్నా చేశారు. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు వేలాది మంది రైతులు తరలివచ్చారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలంగాణ తల్లి విగ్రహానికి పాలిభిషేకం అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోపాటు పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన రేవంత్

### -బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి

రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి అనేక ఆంక్షలు పెట్టి రైతులను మోసం చేశాడని నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి విమర్శించారు. రుణమాఫీ మోసంపై బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చాయి. ముందుగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ నాయకులు రాంకిషన్‌రెడ్డితోపాటు జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుభాష్‌రావు, పార్టీ

నిర్మల్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి

పట్టణాధ్యక్షులు రాము మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల పార్టీ కన్వీనర్లు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, చిన్నారెడ్డి, సుదాన్, జాగృతి జిల్లా అధ్యక్షుడు టీ.లక్ష్మణాచారి, సీనియర్ నాయకులు జీవన్‌రావ్, దేవీ శంకర్, మధూకర్‌రెడ్డి, మల్లేశ్, శ్యాంరెడ్డి, పూరదరి నరహరి, జీవన్‌రెడ్డి, గండ్రత్ రమేశ్, కిరణ్‌రావ్, నజీరొద్దీన్ పాల్గొన్నారు.

## షరతుల లేకుండా రుణమాఫీ చేయాలి

### - మాజీ మంత్రి జోగు రామన్న

ఎన్నికల సమయంలో దేవుళ్లపై ఒట్టు పెట్టుకుని రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను దగా చేశారని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో 1.64 లక్షల మంది రైతులు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే కేవలం 55 వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులపై ప్రేమ కనపరిచి తర్వాత గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ విషయంలో రైతుల ఆందోళనకు అండగా ఉంటామని, అర్హులైన రైతులందరికీ బ్యాంక్‌లోన్ రద్దు అయ్యేంత

మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

వరకు పోరాడుతామన్నారు. తెలంగాణ తల్లిని అనుమానించేలా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోకండ్ల రమేశ్, యూనీస్ అక్బానీ, నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, విజ్జిగిరి నారాయణ, అజయ్, సతీశ్ పవార్, లింగారెడ్డి, సాజిదొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


ఇచ్చోడలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే అనిల్, రైతులు

## కేసులు ఉప సంహరించుకోకపోతే రైతు ఉద్యమం

### - ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. ఇచ్చోడలో జరిగిన రైతుధర్నాలో ఆయన మాట్లాడారు. బ్యాంకు రుణాలు రద్దు చేయాలంటూ బోథ్ నియోజక వర్గంలో ఆందోళనలు చేస్తున్న రైతులపై పోలీసులు కేసులు బనాయిస్తున్నారని, కేసులకు భయపడే ప్రసక్తి లేదని తెలిపారు. కేవలం 40 శాతం మంది రైతులకు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందని మండిపడ్డారు. రేషన్‌కార్డు కాకుండా పట్టాపాసు పుస్తకం ఉన్న రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. ఆంక్షలు లేని రుణమాఫీ చేయడంతోపాటు రైతులపై కేసులు ఎత్తివేయకపోతే రైతు ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్న మాటలకు పొంతన లేదని, వారి వ్యాఖ్యలు రుణమాఫీ ఎగ్గొట్టేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇచ్చోడలో రైతు ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఖానాపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఊట్నూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ పీజేఆర్

## గోడదూకి రాణాకు..

ఆదిలాబాద్ టూటౌన్‌లో జైనథ్ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు

- ప్రిన్సిపాల్ వేధిస్తున్నారంటూ పోలీసులకు వినతి
- పోలీస్ స్టేషన్‌కు వచ్చిన 46 మంది విద్యార్థులు
- కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు విచారణ

ఆదిలాబాద్, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ) : జైనథ్ బీసీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు గురువారం ఉదయం స్కూల్ వదిలి పోలీస్‌స్టేషన్ బాట పట్టారు. ఈ పాఠశాల మావల సమీపంలో అద్దె భవనంలో కొనసాగుతుండగా పట్టణానికి దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం ఉన్న స్కూల్ నుంచి పదో తరగతి చదువుతున్న 46 మంది విద్యార్థులు పోలీస్ స్టేషన్‌కు నడుచుకుంటూ వచ్చారు. రాత్రి మూడు గంటల సమయంలో బయలుదేరి ఐదు గంటల వరకు స్టేషన్‌కు చేరుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సంగీత తమను వేధిస్తుందంటూ పోలీసులకు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులు ఉన్నతాధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. పాఠశాలలో భోజనం, కరెంటు సమస్యలున్నాయని, వీటిని అడిగితే ప్రిన్సిపాల్ వేధిస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ ఇటీవల ఓ విద్యార్థిని సస్పెండ్ చేశారని, తమ కండక్ట్ సరిగా లేదంటూ సర్టిఫికెట్లపై రాస్తా అంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు.

### భద్రత ఏదీ?

పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తారు. వీరితో వాచ్‌మన్ కూడా కాపలా ఉంటాడు. ఉదయం సమయంలో పాఠశాలకు చెందిన 46 మంది విద్యార్థులు గోడదూకి బయటకు వచ్చినా ఉపాధ్యాయులు, వాచ్‌మన్ గుర్తించకపోవడం భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయులు, వాచ్‌మన్ సరిగా విధులు నిర్వహిస్తే తాము బయటకు ఎలా వస్తామని విద్యార్థులు అనడం గమనార్హం. కాగా.. ప్రిన్సిపాల్ విద్యార్థులను వేధిస్తున్న ఘటనకు సంబంధించి కలెక్టర్ రాజర్షి షా విచారణకు ఆదేశించారు. ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారి రాజలింగులు పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### విద్యార్థి సస్పెండ్ చేయడంతో ఆందోళన

#### - సంగీత, ప్రిన్సిపాల్

పాఠశాలలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇటీవల ఓ విద్యార్థిని సస్పెండ్ చేయడం జరిగింది. విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేసి అపాలజీ లెటర్ తీసుకున్నాం. సస్పెండ్ అయిన విద్యార్థికి విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని విద్యార్థులకు చెప్పిన వినకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

## ప్రైవేట్ దవాఖానల తనిఖీ

- నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ
- ఏ వైద్యుడు అందుబాటులో ఉంటాడో ఆ వైద్యమే అందించాలి..
- వారంలో మళ్లీ వస్తా.. లోపల సరిచేసుకోవాలి..
- కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఆగస్టు 22 : ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఏ డాక్టర్ అందుబాటులో ఉంటాడో.. అదే వైద్యం అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీగజానన్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. చికిత్సల ధరల పట్టికను ఏర్పాటు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. రెండు కలర్ బ్యాకెట్‌లు మాత్రమే ఉన్నాయని ఇంకొకటి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మందుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. గుర్తించిన లోపాలను వారంలోగా సరిచేసుకోవాలని, మళ్లీ వస్తానన్నారు. వివిధ లోపాలను గుర్తించి షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో కృష్ణ, వైద్యులు నరేందర్ రాథోడ్, శ్రీధర్ ఉన్నారు.

జనరల్ వార్డులో రోగితో మాట్లాడుతూన్న కలెక్టర్ రాజర్షి షా

### బీసీ గురుకులం పాఠశాల తనిఖీ

పట్టణంలోని అనుకుంటలో గల మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలను కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం, స్టార్ రూమ్, సిక్ రూమ్, డ్రైనేజీలను పరిశీలించారు. సిబ్బందికి పలు విషయాలపై సూచనలు, సలహాలు చేశారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించి మెనూ ప్రకారం ఈ రోజు చికెన్ ఉండడంతో ఎన్ని కేజీల చికెన్ తెచ్చారు? ఎంత మంది విద్యార్థులకు వంట చేశారు? వంటి అంశాలను ప్రిన్సిపల్ ఉమాదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోర్ రూం, సిక్ రూంలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

## సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి

- రెవెన్యూ, ఫారెస్ట్ జాయింట్ సర్వే చేయాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవులు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం, ఆగస్టు 22 : సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలిచ్చి, ఫారెస్ట్, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే నిర్వహించి పట్టాలు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీ ప్రకారం రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు విష్ణు, ఆశన్న, ఆత్రం కిష్టన్న, డి.స్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవులు

## కేసులను ఎత్తివేయాలి

### రైతు సంఘం నాయకులు పద్మాకర్ రెడ్డి

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న రైతుల సంఘం నాయకులు

తలమడుగు, ఆగస్టు 22 : రుణమాఫీ కాని రైతులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవ యాత్ర నిర్వహించిన వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని రైతు సంఘం నాయకులు పద్మాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. న్యాయానికి సాక్షి భూతమైన అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు భూత దేవన్న, రావుల ప్రేమేందర్‌రెడ్డి, రజినీ, కె.ఇస్తారీ రెడ్డి, ఎ.స్వామి రెడ్డి, తొడసం మారుతి, అర్జు, ఆర్ష వేణు పాల్గొన్నారు.

## 'నాటుదాం ఒక మొక్క... అమ్మ పేరు మీద'..

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

పాక్‌పట్లలో మొక్క నాటుతున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సోన్, ఆగస్టు 22 :ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో, ఇంటి ఆవరణతోపాటు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటి పెంచాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో 'నాటుదాం ఒక మొక్క... అమ్మ పేరు మీద' కార్యక్రమానికి హాజరై నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క చొప్పున అమ్మ పేరు మీద నాటి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేశ్‌తో పాటు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**న్యూపోచంపాడ్‌లో..**

నిర్మల్ మండలంలోని న్యూపోచంపాడ్ గ్రామంలోని గురువారం నాటుదాం ఒక మొక్క-అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా డీఆర్‌డీవో విజయలక్ష్మి హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గజానంద్‌రావు, ఏపీవో తుల రామకృష్ణ, ఏవో వసంత్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 22 : యోగాసన స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలకు అనుహ్య స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 87 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పలువురు ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుందని జిల్లా స్పోర్ట్స్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ కృష్ణం రాజు, గంగాధర్, శాంతి నికేతన్ ఫౌండర్ శ్రీ పద్మనాభం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసవాల సంఖ్యను పెంచాలి..

### కలెక్టర్ అభిలాష అభినవ్

దవాఖానాలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నర్సాపూర్ (జి), ఆగస్టు 22 : నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్, బయటి రోగుల విభాగం, మందుల గది, టీకాల గదిలో సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సౌకర్యాలు, అందిస్తున్న చికిత్సలను రోగులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఎన్ నోడల్ అధికారి సౌమ్య పాల్గొన్నారు.